నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం 28 జులై 2023

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

నవతెలంగాణ-బోధన్

రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి గ్రామాలలో పర్యటించాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు అత్యవసర సహాయ కేంద్రంగా బోధన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలని, వారి సహాయార్థం అత్యవసర ఫోన్ నెంబర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల సహాయార్థం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముఖ్యంగా పిల్లలను విద్యుత్ స్తంభాలు దగ్గరికి పోకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాలలో తిరుగుతూ ప్రజల ఇబ్బందులు తెలుసుకొని తనకు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని జాతీయ రహదారి 161పై చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని జాతీయ రహదారి 161పై నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అదుపుతప్పింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్ అబ్దుల్ అఫ్రోజ్ (26) గాయలు కాగా, సైక్ ముత్తోగి (24) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ కోనారెడ్డి తెలిపారు. గాయాలైన సైక్ ముత్తోగి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేయడంతో దిగువకు విడుదలవుతున్న నీరు



కుండపోత

ఉమ్మడి జిల్లాను ముంచెత్తిన వర్షం

- కామారెడ్డికి రెడ్ అలర్ట్
- నిజామాబాద్‌లో 21 వేల ఎకరాల్లో పంట నష్టం
- తెగిన చెరువులు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఎస్సారెస్పీ, నిజాంసాగర్ గేట్లు ఎత్తివేత
- కామారెడ్డిలో పంట మునక వివరాల్లేవు : వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి
- నేడూ భారీ వర్ష సూచన

ఆకాశానికి చిల్లు పడ్డదా అన్నట్టు.. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాను వరుణుడు ముంచెత్తాడు. భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. వర్షాల ధాటికి చెరువులు, కుంటలు నిండిపోయాయి. పలు చెరువులకు గండ్లు పడ్డాయి. పలు ఇండ్లు నేలకూలాయి. నందిపేట్ మండలంలో చేపలవేటకు వెళ్లి ఒకరు, పిట్లం మండల కేంద్రంలో మరో వ్యక్తి గల్లంతయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాల కేంద్రాలకు తరలించారు. నిజామాబాద్ జిల్లాలో 14 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇక బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అలర్ట్ అయ్యింది. కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. నేడూ భారీ నుంచి అతిభారీ వర్షసూచన ఉండటంతో ప్రజలు భిక్కుభిక్కుమంటూ జీవిస్తున్నారు. - నవతెలంగాణ, నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



నిజామాబాద్ రేడియోస్టేషన్ ఎదురుగా..

నిజామాబాద్ జిల్లాలో గురువారం భారీ వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలో సగటున 7.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా ఏర్గట్ల 15.9, కమ్మర్‌పల్లి 14.3, మోర్తాడ్ 13.3, మెండోరా 12.3, బాల్కొండ 11.9, వేల్పూర్ 10.5, ముప్కాల్ 10.3, నవీపేట్ 8.6, జక్రాన్‌పల్లి 8.1, ఆర్మూర్ 7.4, నందిపేట్, మాక్లూర్ 6.4, రెంజల్ 5.9, కోటగిరి 5.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఇక బోధన్, రుద్రూర్, వర్ని, నిజామాబాద్, మోపాల్, ఎడపల్లి తదితర మండలాల్లో 4 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యింది. నిజామాబాద్ జిల్లాలో చెరువులు నిండిపోయాయి. పంట పొలాలను వరద నీరు ముంచెత్తుతోంది.

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేత

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ మహారాష్ట్ర నుంచి వస్తున్న భారీ వరదతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. మొత్తం 90 టీఎంసీల నిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టులో ప్రస్తుతం 78 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తుండటంతో గురువారం ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో ఇక 2,42,886 క్యూసెక్కుల నీరు వస్తుండగా వరద గేట్ల ద్వారా 1,50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నీటిమట్టం 1091 ఫీట్లకు చేరింది. నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లోకి ప్రజలను రానీయ్యడం లేదు. నదిపరివాహక ప్రాంతంలోకి పశువుల కాపరులు, మత్స్యకారులు, రైతులు వెళ్లనీయకుండా అప్రమత్తం చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా గాంధారి 7.7, నస్రుల్లాబాద్ 7.3, పాల్వంచ 6.9, తడ్వాయి 6.1, కామారెడ్డి 6, భిక్కనూర్ 5.2, దోమకొండ 5, రాజంపేట 4.8, గాంధారి 4.7 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయ్యింది. కామారెడ్డి జిల్లాలో ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు నిండాయి. జిల్లాలో మొత్తం 1425 చెరువులు ఉండగా.. 610 చెరువులు మత్తడి దూకుతున్నాయి.

నిజాంసాగర్ నాలుగు గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్ ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 38,500 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 15.557 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 19 టీఎంసీలు. 6,7,10,2 గేట్లను ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

చెరువులకు గండ్లు..

ఉభయ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండిపోయాయి.గురువారం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు కొన్ని మండలాల్లో చెరువులకు గండ్లు పడ్డాయి. ఆ నీరంతా పంటలను ముంచెత్తింది. వేల్పూర్ మండలంలో ఆరు, కమ్మర్‌పల్లిలో ఒక చెరువుకు గండిపడింది. ఆర్మూర్‌లో రెండు చెరువులు దెబ్బతిన్నాయి.

	మొత్తం	0-25%	25-50%	50-75%	75-100%	నిండిపోయినయి
నిజామాబాద్	1086	2	1	28	121	934
కామారెడ్డి	1425	8	50	306	451	610



పూలంగ్‌కు వెళ్లే కాలువకు నీటి ఉధృతి.. రోటరీనగర్‌లో నీట మునిగిన పంటపొలాలు.. ఇండ్ల ముందు నిలిచిన నీరు

21 వేల ఎకరాల్లో పంట నష్టం

నిజామాబాద్‌లో వర్షానికి 21,500 ఎకరాల్లో పంట నష్టపోయినట్టు ప్రాథమిక అంచనా వేశారు. గడిచిన మూడు రోజుల్లో భారీ వర్షాలకు నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 21 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. గురువారం ఒక్కరోజే జిల్లాలో అత్యధికంగా 14,962 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పూర్తిస్థాయిలో నీరు పొలాల్లో నుంచివెళ్లిన తరువాతే అంచనా నిర్దిష్టంగా తేలుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. కామారెడ్డిలో పంట నష్టం వివరాల సేకరణపై వ్యవసాయశాఖ అలసత్వంగా ఉంది. భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలో పంట నష్టంపై వివరాలు అడడగా.. అలాంటి వివరాలేమీ లేవని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి తెలిపారు.

పంట	రైతులు	ఎకరాలు
వరి	7373	10913
సోయాబీన్	2835	4189
మొక్కజొన్న	4183	5193
పసుపు	880	1205
మొత్తం	15271	21500

నేడూ భారీ వర్షసూచన

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు నేడూ భారీ వర్ష సూచన ఉన్నట్టు వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం రెండు జిల్లాలో సాధారణం నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.



మోపాల్ : మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయంలో చేరిన వర్షపునీరు


కౌలాస్‌నాళా మూడు గేట్లు ఎత్తివేత..



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్‌నాళా ప్రాజెక్ట్ నుంచి గురువారం జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మూడు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసినటుట ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ మాట్లాడుతూ.. పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు కాగా ప్రస్తుతం 457:50 మీటర్లు నీరు ఉందని ఇన్ ఫ్లో 6450 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 9684 క్యూసెక్కులు రాగా.. దిగువకు మూడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు.

పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు..



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్(లింగంపేట్)

నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పోచారం ప్రాజెక్టు ప్రమాద స్థాయిలో పొంగిపొర్లుతోంది. పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1464 నీటిమట్టం కాగా వారం రోజుల క్రితమే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. దీంతో ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. దీంతో పోచారం ప్రాజెక్టు నుంచి నిజాంసాగర్‌కు 25 వేల క్యూసెక్కుల నీరు వెళ్తుందని ప్రాజెక్టు నీటిపారు శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.


కళ్యాణి ప్రాజెక్ట్ 4 గేట్లు విడుదల..



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మారెడ్డి గ్రామ పరిధిలో ఉన్న కళ్యాణి ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి 5000 క్యూసెక్కుల నీటిని వదిలి దిగువ మంజీరా నదిలోకి వదిలినట్లు ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఇన్ ఫ్లో 5000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు తెలిపారు.

అలీసాగర్ గేట్లు ఎత్తివేత..



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని అలీసాగర్ చెరువులోకి నిజాంసాగర్ ప్రాజెక్టు వరద నీరు అధికంగా చేరడంతో ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

పొంగిపొర్లుతున్న త్రివేణి సంగమం

నవతెలంగాణ-రెంజల్

గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రెంజల్ మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం జలకలతో ఉటపడుతోంది. గురువారం ఎగువ భాగంలో అత్యధికంగా వర్షాలు పడుతూ ఉండడం, బాబ్లీ గేట్లు తెరవడంతో పైనుంచి వరద ఉధృతి పెరగడంతో గోదావరిలో నీటి ప్రవాహం వేగం పెరిగింది. పశువుల కాపర్లు, మత్స్యకారులు గోదావరి పరిసర ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, గోదావరిలో పుణ్య స్థానాలకు విచ్చేసే భక్తులు ఘాట్ వద్దని స్థానాలు ఆచరించాలని అధికారులు స్పష్టం చేశారు.

మంజీరాకు పెరుగుతున్న వరద నీరు

నవతెలంగాణ-బోధన్

భారీ వర్షాల కారణంగా గురువారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి సాలురా మంజీర నదికి వరద నీటి ప్రవాహం పెరుగుతుంది. దాంతో సమీప గ్రామాల ప్రజలు మంజీరా నది సమీపంలోకి వెళ్లకుండా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఆపదలో ఆదుకున్న పోలీసులు..

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని అమర్లబండా గ్రామానికి చెందిన సుంకరి దివ్యను గురువారం వాగు దాటించినట్టు పోలీసులు తెలిపారు. భారీ వర్షాలకు అమర్లబండ గ్రామ నుంచి రాకపోకలకు వీలులేకపోవడంతో పోలీసులు కేజీవీల్ ట్రాక్టర్ సహాయంతో వాగుదాటించారు. అనంతరం పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో ఆమెను కామారెడ్డి హస్పిటల్‌కు తరలించారు.



వేల్పూర్ మండలం మోతె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పల వాగు

జోరువానలోనూ.. పోరు ఆగలేదు...

- కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా
- భారీ వర్షంలోనే మూడు గంటలు నిరసన
- ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరిక

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



వర్షంలోనూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

కామారెడ్డి జిల్లాలో జోరువానలోనూ పంచాయతీ కార్మికులు కదం తొక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి చేపట్టారు. భారీ వర్షంలోనే సుమారు మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినదించారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో సర్కారు ఇంకా అలసత్వం ప్రదర్శిస్తే ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి చేపట్టారు. మొదట ర్యాలీగా మున్సిపల్ ఆఫీసు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. జిల్లాలో రెడ్ అలర్ట్‌తో భారీ వర్షం ముంచెత్తినప్పటికీ.. కార్మికులు వర్షాన్నీ సైతం లెక్కచేయకుండా వందలాది మంది కార్మికులు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి ఎర్రజెండా చేతపట్టి కదం తొక్కారు. 'పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి' 'ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలి' 'ఉద్యోగభద్రత కల్పించాలి' 'మల్టిపర్పస్ విధానం రద్దు చేయాలి' 'కార్మికులపై బెదిరింపులు మానుకోవాలి' అంటూ నినాదాలు చేశారు. కార్మికుల ధర్నా నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయ గేట్లను మూసివేసి బయటే నిలుపుదల చేశారు. జోరువానలోనే సుమారు మూడు గంటల పాటు కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ వెంకటిగౌడ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడారు. పంచాయతీ కార్మికులు 22 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ.. సర్కారు సమస్యలు పరిష్కరించకుండా విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ ఆదేశాలతో సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రూ.80 వేల జీతం ఉన్నవారు తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేశారు. రూ.8 వేల వేతనం ఉన్న పంచాయతీ కార్మికులు సమ్మె చేయొద్దని బెదిరిస్తున్నారు' అని ఎద్దేవా చేశారు. వారోత్సవాల్లో కార్మికుల కాళ్లు కడిగితే కడుపు నిండదని, రాష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చినట్టుగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు సేవ చేసిన పంచాయతీ కార్మికుల పట్ల సర్కారు కపట ప్రేమ నటిస్తోందని అన్నారు. కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు మరింత ఉధతం చేస్తామని, ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజనర్సు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం, నాయకులు బాలనర్సు, కారోబార్ యూనియన్ నాయకులు, ప్రభాకర్, దుర్గాగౌడ్, భద్రప్ప శివగౌడ్, స్వామి, సాయిలు, శ్యాం, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లిన పంచాయతీ కార్మికులు..

పిట్లం : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 22 రోజులకు చేరుకుంది. అయినప్పటికీ ప్రభుత్వము స్పందించకపోవడంతో గురువారం కలెక్టర్ కార్యాలయ ముట్టడికి పిలుపునివ్వడంతో కార్మికులు భారీ సంఖ్యలో ప్రత్యేక వాహనములో తరలివెళ్లారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరు గల్లంతు

- వేర్వేరు చోట్ల ఘటనలు

నవతెలంగాణ-పిట్లం/నందిపేట్




గల్లంతైన జంగం కృష్ణ, ఎల్లప్ప (ఫైల్)

చేపల వేటకు వెళ్లి ఇద్దరు గల్లంతయ్యారు. ఈ ఘటనలు వేర్వేరుచోట్ల గురువారం చోటుచేసుకున్నాయి. పిట్లం మండల కేంద్రానికి చెందిన జంగం కృష్ణ నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి నల్లవాగు మత్తడిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో వరద ఉధృతి పెరగడంతో అందరూ చూస్తుండగానే అదుపుతప్పి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ వరద ఉధృతి పెరగడంతో సహాయ చర్యలకు అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ వరద ఉధృతిలో గాలింపు చర్యలు ముమ్మరం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నందిపేట్ : చేపల వేటకు వెళ్లి ఒకరు కుద్వాన్ పూర్ చెరువులో గల్లంతయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్‌పూర్ గ్రామానికి చెందిన దేవనమైన ఎల్లప్ప (35) తన స్నేహితులతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో కుద్వాన్ పూర్ పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు దిగారు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడని ఎంత వెతికిన దొరకలేదని వారు తెలిపారు. గల్లంతైన వ్యక్తికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఇంటర్ ఒకేషనల్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర గురుకుల కళాశాలలో ఇంటర్ ఒకేషనల్ కోర్సు లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జీ.మాధవి లత గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎస్-ఎస్‌సి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులకే అవకారం ఉంటుందని ఆమె తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన ఆసక్తి గల విద్యార్థినులకే దరకాస్తు చేసుకొనే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.2023 లో ఎస్ ఎస్ సి పబ్లిక్ పరీక్షల్లో సాధించిన జీపీఏ మెరిట్ ఆధారంగా బాలికలను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మెరిట్ జాబితా లో ఉన్న బాలికలు తమ ఒరిజినల్ సర్టిఫికేట్ లు తీసుకొని వచ్చి కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. ఈనెల 29 నాటికి తక్షణ ప్రవేశాలు పూర్తి చేస్తామని వివరించారు.

వానలోనూ ఆగని సమ్మె

నవతెలంగాణ-భీంగల్



పంచాయతీ కార్మికులు తమ సమ్యలను పరిష్కరించాలని కోరుతు చేపట్టిన సమ్మెలో బాగంగా గురువారం జడివానను సైతం లెక్కచేయకుండా గురువారం మండలపరిషత్ కార్యాలయంలో సమ్మెలో కూర్చున్నారు. ప్రభుత్వం ఇప్పటికైన తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా, మండల అధ్యక్షులు రాజేశ్వర్, బాలయ ప్రభుత్వాన్ని కోరారు. సమ్మెలో రాజన్న, మేస రమేష్, ప్రశాంత్, నవీన్, నర్సయ్య, ముత్తెన్న, భోజన్న, లలిత, సునిలత మరియు కార్మికులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. అస్తవ్యస్తం

- తెగిన బీటీ రోడ్లు, నిలిచిన రాకపోకలు
- అలుగులు పారుతున్న చెరువులు, కుంటలు
- కూలిన ఇండ్లు, కోతకు గురైన రహదారులు
- పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. బుధవారం ఉదయం నుండి గురువారం ఉదయం వరకు మండలంలో 147.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. భారీ వర్షంతో మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నుండి మత్తడి దూకుతూ అలుగులు పారుతున్నాయి. వరద నీరు రోడ్లపైకి చేరి రోడ్లు తెగిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కమ్మర్ పల్లి- వడ్యాట్, హాస కొత్తూర్ - బషీరాబాద్, ఉప్లూర్ - డబ్బా, కమ్మర్ పల్లి - ఉప్లూర్ గ్రామాల మధ్య వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. హాస కొత్తూర్ చెరువు అలుగునీటికి కమ్మర్ పల్లి నుండి వడ్యాట్ వెళ్లే బీటీ రోడ్డు కోతకు గురైంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను వరద నీరు చుట్టేసింది. కళ్యాణ మండపం, ఎస్టీ బాలికల హాస్టల్ చుట్టూ వరద నీరు మొత్తం నిండిపోయింది. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న నివాస గృహాల చుట్టూ వరద నీరు చేరింది. భారీ వర్షాల మూలంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోకి వరద నీరు చేరడంతో విద్యార్థులను భారీ వర్షంలోనే ఖాళీ చేయించి ఎంపీడీవో కార్యాలయంలో ఆశ్రయం కల్పించారు. కమ్మర్ పల్లి నుండి ఉప్లూర్ వెళ్లే దారిలో ఉన్న వరద కాలువ కల్వర్టు వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. భారీ వర్షంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పొలాల్లోకి వెళ్లే బీటీ రోడ్లు పలుచోట్ల కోతకు గురయ్యాయి. వరద తాకిడికి గురైన ప్రాంతాలను మంత్రి ప్రశాంత్ రెడ్డి మండల అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. కూలిపోయే దశలో ఉన్న ఇండ్లలోని ప్రజలకు ఆశ్రయం కల్పించేందుకు సర్పంచులు చర్యలు చేపట్టారు.

మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులో ఉన్న కాడి చెరువు వద్ద వరద నీరు రోడ్డుపై నుండి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపివేశారు. సర్పంచ్ శక్కారం అశోక్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఒకవైపు గ్రామపంచాయతీ ట్రాక్టర్ అడ్డుపెట్టి, మరోవైపు చెట్ల కొమ్మలను అడ్డువేశారు. వరద ఉధృతిని ఎస్ఐ రాజశేఖర్ పరిశీలించారు. ఈ రోడ్డు మీదుగా కోన సముందర్, భీంగల్ వెళ్లేవారు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా మండల ప్రజలకు తెలియజేశారు. రాకపోకలు లేకుండా పోలీస్ పహార ఏర్పాటు చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి వేముల

కస్తూర్బా విద్యార్థులకు ధైర్యం చెప్పిన మంత్రి వరద తగ్గాక స్వస్థలాలకు పంపించాలని అధికారులకు ఆదేశం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనం చుట్టూ వరద నీరు చేరడంతో విద్యార్థినులను అధికారులు పక్కనే ఉన్న ఎంపీడిఓ కార్యాలయానికి తరలించారు. భారీగా కురుస్తున్న వర్షంతో విద్యాలయంలోకి వరద నీరు చేరడంతో ఎంపీడీవో సంతోష్ రెడ్డి, తహసీల్దార్ సురేష్ ప్రత్యేక అధికారిని గంగామణితో మాట్లాడి విద్యార్థినులను ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు.వర్షంతో దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించేందుకు మండలానికి విచ్చేసిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కస్తూర్బా గాంధీ విద్యార్థుల తరలింపును తెలుసుకొని ఎంపీడీవో కార్యాలయంలో విద్యార్థినులను కలిసి మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భయపడాల్సిన అవసరం లేదని, తామంతా ఉన్నామని ధైర్యం చెప్పారు. విద్యార్థినులకు అవసరమైన భోజన సౌకర్యం ఇతర ఏర్పాట్లు చేయాలని అధికారులకు, సర్పంచ్ గడ్డం స్వామికి మంత్రి సూచించారు. వరద తగ్గాక వారి స్వస్థలాలకు పంపించాలని ఆదేశించారు.

ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్



ముంపు బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన అనేక కాలనీలో పేదల ఇళ్లల్లోకి నీరు రావటంతో సిపిఎం పార్టీ బృందం సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసున్నారు. ఎడతెరిపి లేని వర్షాల వల్ల అనేకమంది నిరుపేదల ఇండ్లలోకి నీళ్లు చేరటంతో పేదలు కనీసం కూర్చోవడానికి కూడా వీలు లేకుండా పోయిందని, సరుకులు తడిసిపోయాయని తినడానికి వీలు లేకుండా పసిపిల్లలను పట్టుకుని కాలం వెలుగుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ వర్షాల వల్ల ఇండ్లలోకి నీరు చేరిన పేదల కుటుంబాలకు ప్రభుత్వం 25 కిలోల బియ్యం, 5వేల రూపాయలు తక్షణ సాయం అందించడంతోపాటు వారికి ప్రత్యామ్నాయ వసతి సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. పేదల సొంత ఇండ్లు లేకపోవడంతో పాటు అద్దె ఇండ్లలోనే కష్టాలు పడుతున్నారని, వారిని ఆదుకోవటానికి ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్. ఎం.గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, నగర కమిటీ సభ్యులు రహమత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలను గురువారం అధికారులతో కలిసి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా పరిశీలించారు. నాగారం, భారతి రాణి కాలని, పూజారి కాలని, బాబాన్ సాబ్ పహాడి, దొడ్డి కొమురయ్య కాలని,ధర్మపురి హిల్స్, కాలనీలని పరిశీలించారు. బాబాన్ సాబ్ పహాడి వద్ద మహబూబ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వసతులని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు.ఈ సందర్భంగా బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాల్లో భోజన వసతి మంచి నీటి వసతి కల్పించామని చెప్పారు.. వర్షం వరద తగ్గు ముఖం పట్టే వరకు పునరావాస కేంద్ర లలో ఆశ్రయం పొందాలని తెలిపారు.నగర పాలక సంస్థ కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. 08462-221001 నంబర్ కాల్ చేసి సహాయం పొందాలని తెలిపారు. శిథిల భవనాల్లో ఉంటే వెంటనే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్,డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్,బి ఆర్ ఎస్ నాయకులు,దండు శేఖర్,మున్సిపల్ అధికారులు సాగర్,మురళి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో సమగ్ర వికాసం సాధ్యం

కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్ రావు



నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

క్రీడలతో విద్యార్థుల్లో సమగ్ర వికాసంతో సాధ్యం అవుతుందని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్ రావు అన్నారు. కేంద్రీయ విద్యాలయ నిజామాబాద్‌లో జాతీయ విద్యావిదానం 2020 అమలులోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వేడుకను గురువారం నిర్వహించారు. జాతీయ విద్యావిదానం 2020 కేంద్రీయ విద్యాలయలలో అమలుతీరుపై వివరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న 1250 విద్యాలయాల్లో నిపుణ్ భారత్ (నేషనల్ ఇనిషియేటివ్ ఫర్ ప్రొఫిసియెన్సి ఇన్ రీడింగ్ విత్ అండర్ స్టాండింగ్ అండ్ న్యూమరసి) లో భాగంగా ఎన్సీఈఆర్టి ద్వారా నిర్ధారించిన అభ్యాసన ఫలితాలను సాధించడానికి పటిష్టమైన బోధన విధానంతో ముందుకు వెళు తున్నామని తెలిపారు. విద్యార్థుల మూల్యంకనం బహుళ విధానంలో ఆన్లైన్ పీఐఎంఎస్ పోర్టల్ ద్వారా చేయడం వల్ల సరైన ఫలితాలు సాధిస్తున్నామని అన్నారు. 49 కేంద్రీయ విద్యాలయాల్లో 3,4,5 సంవత్సరాల బాల బాలికలకు "బాలవాటిక" 1,2,3లో ప్రవేశాలు కల్పించారని అన్నారు. 450 కేంద్రీయ విద్యాలయలలో ఈ విద్యా సంవత్సరంలో "బాలవాటిక-3" లో 5సంవత్సరాల బాల బాలికలకు ప్రవేశాలు కల్పించారని తెలిపారు. కేంద్రీయ విద్యాలయలలో పటిష్టమైన మౌళిక సదుపాయాలతో పాటు, ఎన్సిసి, యోగ, స్కౌట్స్, గైడ్స్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు, వివిధ ఒలింపియాడ్లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల సమగ్ర వికాసం సాధ్యం అవుతుంది అని అన్నారు. నిజామాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ బోధనా విద్యలో జాతీయ విద్యావిదానం 2020 ద్వారా సమగ్రమైన మార్పునకు శ్రీకారం చుట్టారని అన్నారు. భారతీయ మూలాలతో, విలువలతో ప్రపంచానికి అవసరమైన మానవవనరులను భావితరాలకు అందజేయడంలో జాతీయ విద్యావిదానం 2020 తోడ్పడుతుందని తెలిపారు. పీఎంఈ విద్య అనే సమగ్రమైన ప్రణాళిక ద్వారా బహుళరీతులలో జీవితకాల విద్యా అవకాశాలు అందరికి ఉచితంగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తదనంతరం విద్యాలయంలో జాతీయ విద్యావిదానం అమలు అవుతున్న తీరు పై ఆక్టివ్ బెస్ట్ లెర్నింగ్ ప్రదర్శన నిర్వహించడంతో అందరూ ఆసక్తితో తిలకించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ నిజామాబాద్ ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

బీసీలకు 47శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- బీసీ విద్యార్థి సంఘం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీసీలకు 47శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. తెలంగాణ యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీసీల రిజర్వేషన్లు కేటాయింపు, అమలు అంశంపై గురువారం తెలంగాణ యూనివర్సిటీ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కొన్ని సంస్థలు కుట్రపూరితంగా, వివక్షపూరితంగా నిర్లక్ష్యపూరితమైన వైఖరిని వ్యవహరిస్తున్నాయని అన్నారు. అన్ని రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కేటాయింపులలో తమిళనాడును ఒక నమూనాగా తీసుకొని బీసీలకు 47శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దీనివల్ల సామాజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో యూనివర్సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, సెక్రెటరీ నరేష్, ప్రశాంత్, గణేష్, సూర్య భాయ్, యాదగిరి, సాయిబాబ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వరద

నవతెలంగాణ-వేల్పూర్

వేల్పూర్ మండలంలోని లక్కోర గ్రామ శివారులు నేషనల్ హైవే రోడ్ నెంబర్-63 ఆర్మూర్ నుండి జగిత్యాల వెళ్లే రహదారిపై లక్కోర గ్రామంలో ఉన్న పెద్ద చెరువు నుండి వస్తున్న వరద నవాబ్ చెరువులోకి ప్రవహిస్తున్న మార్గమధ్యంలో నేషనల్ హైవేపై నుంచి ప్రవహిస్తోంది. జాతీయ రహదారిపై చెట్టు కూలడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

గౌరమ్మ చెరువుకట్ట నీటివిడుదల

ముందు జాగ్రత్తగా మండల కేంద్రంలోని గౌరమ్మ చెరువు కట్ట ద్వారా నీటిని విడుదల చేశారు. ఎప్పటి కప్పుడు చెరువు పరిస్థితిని అంచనా వేస్తూ చెరువు అలుగును, కట్టను పరిశీలించారు. నీటి పారుదల అధికారులు యస్. ఈ బాను, ఎ. ఈ ప్రదీప్, సర్పంచ్ తీగల రాధ మోహన్, ఉప సర్పంచ్ పిట్ల సత్యం, సెక్రెటరీ వినోద్ కుమార్ ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

చెరువుల అలుగులు తొలగింపు

- పరిశీలించిన జడ్పీచైర్మన్

నవతెలంగాణ-మాక్లూర్

మండల అధికారులు మాణిక్ బండారు 63వ జాతీయ రహదారిపై పారుతున్న నీటిని పరిశీలిస్తూ ప్రయాణికులను జాగృతం చేశారు. పలు గ్రామాల్లో చెరువుల అలుగులను తొలగించి నీటిని వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అధికారులతో పాటు జిల్లా జెడ్పీ చైర్మన్ డీ. విఠల్ రావు వెంకటాపూర్, అమ్రాద్ తండా, మాణిక్ బండార్ గ్రామాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మనిక్ బండార్ కమాన్ వద్ద నిలిచిన నీటి వల్ల ప్రజలు అనేక అయిబ్బందులను ఎదుర్కొంటున్నారని తహశీల్దార్ శంకర్, ఎస్సై సుధీర్ రావు అక్కడే ఉండి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఆర్డీఓ రవి, ఎంపిడిఓ క్రాంతి, ఇరిగేషన్ ఇఇ రవికుమార్, ఏఇ దివ్య భారతి, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్, సర్పంచులు గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలకు రాకపోకలు బంద్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/మెపాల్/నవీపేట్

మండలం లోని యానం పల్లి తండా రోడ్ సుద్దులంలో రాకపోకలు బంద్ చేసినట్లు తహసిల్దార్ శ్రీనివాస్ రావు తెలిపారు.



డిచ్‌పల్లి : సిర్నాపల్లి వద్ద బ్రిడ్జిపై పారుతున్న నీరు

సంస్థాన్ సిర్నాపల్లిలో...

ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో పెద్ద చెరువు నిండుకుండలా నిండి ప్రవహిస్తుండడంతో ఇతర గ్రామాల నుండి సిర్నాపల్లికి వెళ్ళే బ్రిడ్జిపై నుండి నీరు ప్రవహిస్తుడటంతో రాకపోకలు బంద్ చేసినట్లు సర్పంచ్ తేలు విజయ్ కుమార్ నవతెలంగాణకు తెలిపారు. డిచ్ పల్లి,ఇందల్ వాయి మండలాల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు నిండుకుండల్లా ఉన్నాయని తహసిల్దార్లు శ్రీనివాస్ రావు, టివి రోజా తెలిపారు.



నవీపేట్ : పారుతున్న జన్నేపల్లివాగు

మోపాల్ : మూడు రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మంచిప్పలో పలుచెరువులు నిండుకుండల్లా మారాయి. మంచిప్పలో చెరువు అలుగుపారింది. మంచిప్ప నుండి అమ్రాబాద్ వెళ్లే రోడ్డు జలదిగ్బంధంలో ఉంది. అక్కడి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి భారీ వర్షాలు ఉన్నందున రూరల్ సీఐ వెంకటరమణ ఎస్సై రామ్‌ను అప్రమత్తం చేశారు. మంచిప్ప సర్పంచ్ ఇందూరు సిద్ధార్థ అలుగు పారుతున్న ప్రదేశంలో రోడ్డుకి రెండు వైపులా గ్రామస్తులతో కలిసి రహదారిపై అడ్డంగా రాళ్లను వేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీష్, విలేజ్ ప్రెసిడెంట్ నవీన్ పాల్గొన్నారు.

నవీపేట్ : మండలంలోని ఆశాజ్యోతి కాలనీ నుండి బినోల వెళ్లే గురువారం కోతకు గురైంది. భారీ వర్షాలకు రోడ్డుపై నుండి నీళ్లు పారుతుండడంతో రోడ్డు సగానికి పైగా కోతకు గురైంది. దీంతో సర్పంచ్ రవి అటువైపు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు. బినోల వెళ్లే ప్రయాణికులు అటువైపు వెళ్ళవద్దని సూచించారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన మంత్రి

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలో వరద ప్రాంతాలను, గ్రామాలను రహదారులను మంత్రి ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. జాతీయ రహదారి 63 గాండ్ల పెట్ పెద్దవాగు వంతెన నుండి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వంతెనపై నుండి భారీ వాహనాలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారి నుండి మోర్తాడ్ గ్రామానికి వెళ్లే రైల్వే వంతెన వద్ద నిలువ ఉన్న నీటిని, డబుల్ బెడ్ రూమ్లా ఇండ్ల నివాసాల వద్ద వస్తున్న నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదని అన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- ఇళ్లలోకి చేరిన నీళ్లు
- నీటమునిగిన పంటలు

నవతెలంగాణ-ఆర్మూర్/ముప్కాల్

అల్ప పీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా గురువారం కురిసిన వర్షంతో జనం బిక్కుబిక్కు మంటూ గడిపారు. వర్షం ఏకధాటిగా పడడంతో చెరువులు అలుగులు పోశాయి. పలు చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. గ్రామాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని హెచ్చరికలు జారీ చేశారు. పట్టణంలో పలు కాలనీలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. పట్టణ టీఎస్‌ఆర్టీసి బస్టాండ్ యందు చెరువును తలపించేలా నీళ్ళు చేరినాయి.

పంటల నష్టం,.

గురువారం కురిసిన వర్షం అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. 500 ఎకరాల్లో వరి పంట ,,150 ఎకరాల్లో సోయాబీన్ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారి హరి కృష్ణ తెలిపారు. 24 గంటలలో332 ఎంఎంగా వర్షపాతం నమోదయింది వ్యవసాయ అధికారులు చేపూర్, అందాపూర్ తదితర గ్రామాలలో పరిశీలించారు. పట్టణం నుండి నిజామాబాద్ వెళ్లే జాతీయ రహదారులు కోతకు గురయ్యాయి. పట్టణ శివారులోని రైల్వే స్టేషన్ కు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. పట్టణ శివారులోని బైపాస్ రోడ్డు వద్ద నిర్మాణ దశలో ఉన్న వంతెన వద్ద వరద నీటి ప్రవాహానికి తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది.



ఆర్మూర్ : నీటిమునిగిన పంటలు

భారీ వర్షాలకు ఇళ్లల్లోకి చేరిన నీళ్లు

మున్సిపల్ పరిధిలోని ఒక్కసారిగా ఇళ్లల్లోకి నీరు రావడంతో ఆందోళనకు గురయ్యారు. తలుపులు తీసి బయటకు వచ్చేసరికి వరద ప్రవాహం కనిపించడంతో ఒకరినొకరు ఫోన్లు చేసుకుంటూ అందరిని అప్రమత్తం చేశారు. మున్సిపల్ పరిధిలోని రాజారాం నగర్ కాలనీ, యోగేశ్వర కాలనీ, సరస్వతి నగర్, తిరుమల కాలనీ, రాంనగర్, మామిడిపల్లి రైల్వే బ్రిడ్జి దగ్గర, తదితర కాలనీలో భారీగా వరద నీరు చేరి జన జీవనం అస్తవ్యస్తం అయింది.

ముప్కాల్:భారీ వర్షాలకు మండల కేంద్రంతో పాటు మండలంలోని నాగంపేట్, వెంచిర్యాల, వేంపల్లి, నల్లూర్, కొత్తపల్లి, రెంజర్ల గ్రామాల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ, సుభాష్ కాలనీ ప్రాంతాల్లో డ్రైనేజీలు లేక వర్షపునీరు కాలనీ వాసుల ఇండ్లలో చేరాయి. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంపీపీ భర్త సామ వెంకట్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. వర్షపు నీటిని మరో మార్గం ద్వారా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. వెంచిర్యాల గ్రామంలో మండల ప్రత్యేక అధికారి సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ సీహెచ్. శ్రీనివాసులు స్థానిక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంటలు, చెరువుల ఆయకట్టులు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. రైతులకు, గ్రామస్తులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపీపీ భర్త, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, రెంజర్ల, వెంచిర్యాల సర్పంచులు ఆకుల రాజారెడ్డి, మట్ట సందీప్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గంగారాం, రెంజర్ల ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, పెంటు గంగాధర్ తదితరులు ఉన్నారు

పొర్లుతున్న చెరువులు, వాగులు, కుంటలు

- పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లు
- చెరువులా మారిన మోడల్ స్కూల్ గ్రౌండ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని పెద్ద చెరువు నిండి అలుగు పొంగిపొర్లడంతో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అలుగును గడ్డపారలతో తవ్వారు. అయినా ప్రవాహం తగ్గకపోవడంతో జెసిబితో అలుగు తవ్వించారు. అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ రెవెన్యూ సిబ్బందితో కలిసి తూము ద్వారా నీటిని విడుదల చేశారు. కొలి ప్యాక్ గ్రామంలో పెద్ద చెరువు పొంగి ప్రవహిస్తుండగా జెసిబితో అలుగును కొద్ది వరకు లోతు చేయించారు. అనంతరం రెండు తూముల ద్వారా నీటిని విడుదల చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ గ్రౌండ్ చెరువులా మారింది. నల్లగుట్ట తండాలో ఒక గుడిసె కూలిపోవడంతో సర్పంచ్ మోహన్ సందర్శించి కుటుంబానికి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో ఒక ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. కొలిప్యాక్ లో కమ్మరి గంగాధర్ ఒక ఇల్లు కూలిపోయింది. పడకల్ గ్రామంలో మూడు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎస్సై తిరుపతి కూలిపోయిన ఇండ్లను పర్యవేక్షించి వారిని సురక్షితమైన స్థలాలకు వెళ్లాలని సూచించారు.

నగర శివారు ప్రాంతాలు అస్తవ్యస్తం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ నగరానికి 100 కోట్లతో అభివృద్ధి చేశామని చెబుతున్న ఎమ్మెల్యే నిజామాబాద్‌లోని రోటరీ నగర్, గాయత్రి నగర్, సీతారాం నగర్ కాలనీ, నిజామాబాద్ పట్టణ శివారు ప్రాంతాల్లో ఏ రోడ్డు కూడా సరిగా లేవు. రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఈ కాలనీలలో 100 గజాల్లో ఇల్లు కట్టుకోవడానికి మున్సిపల్ కార్పొరేషన్ కి దాదాపు 1,50,000 వరకు కడుతున్నారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి డ్రైనేజీలు కానీ రోడ్లు కానీ ఎటువంటి అభివృద్ధి లేదు. మరి ఈ డబ్బులన్నీ ఎటు వెళు తున్నాయి.. అలాగే 100 కోట్లతో ఏమి అభివృద్ధి చేశారు అని పట్టణ శివారు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారుగ ముబారక్ నగర్ గ్రామంలో విజయ పబ్లిక్ స్కూల్ పక్క గల్లీలో రోడ్లు మోకాళ్ల లోతు నీళ్లచేరాయి. ఖానాపూర్- కాలూర్ రోడ్‌లో నీళ్లు చెరువులా పారుతుండడంతో అధికారులు కంచ ఏర్పాటుచేసి రోడ్డును మూసివేశారు.



వరదనీరుతో నిండిన శివారులోని కాలనీ

జలదిగ్బంధంలో గ్రామాలు

- రాకపోకలు బంద్

నవతెలంగాణ-ఏర్గట్ల/మోర్తాడ్

భారీ వర్షాలకు మండలంలోని గ్రామాలన్ని జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. రోజు వారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలు ఊర్లు విడిచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మార్వో జనార్దన్, ఎస్సై మచ్చేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు ఉప్పొంగి ప్రవహిస్తున్న ఏర్గట్ల మండలకేంద్రంలోని తీగల వాగు రోడ్డు, ఏర్గట్ల నుండి తొర్తి వెళ్లే రోడ్డును పరిశీలించారు. అనంతరం తక్షణ సహాయక చర్యల నిమిత్తం తడపాకల్, గుమ్మిర్యాల్ గోదావరి నది పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. అటువైపు ఎవ్వరు వెళ్లకూడదని సూచించారు. రాగల 48 గంటలు భారీ వర్షాలున్నందున ప్రజలు అవసరం అయితే తప్ప ఇండ్లలో నుండి బయటకు రాకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఏదైనా ప్రమాదం ఎదుర్కొంటున్నాం అనిపిస్తే గ్రామసర్పంచులను గాని, నాయకులను గాని, అధికారులను గాని ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు. వీరితో పాటు ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పిటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, భీంగల్ ఏడీఏ కంపాటి మల్లయ్య, ఏఓ అబ్దుల్ మాలిక్, ఎంపీఓ శివ చరణ్,తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ :భారీ వర్షాలకు మండలంలోని చెరువులు పూర్తిగా నిండి పొంగిపొర్లగా వంట పొలాలు పూర్తిగా నీటిమయమయ్యాయి. మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయం నీటిమయం కాగా, మోర్తాడ్ గ్రామస్తులు జాతీయ రహదారికి వెళ్లే రహదారి రైల్వే వంతెన కింద నీటి నిల్వతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. సుంకెట్ మోర్తాడ్ రహదారిపై నీరు ప్రవహించడంతో సుంకెట్ వాసులు మండల కేంద్రానికి రాలేకపోయారు. శెట్టిపల్లి చెరువు అలుగు భారీ ప్రవాహంతో పారడతో నీరు గృహ నివాసాల వద్దకు వచ్చి చేరుతోంది. మండల కేంద్రంలో రామాలయం వీధి వద్ద ఓ నివాసగృహం కూలింది.



మోర్తాడ్ : డబుల్‌బెడ్‌రూం గృహసముదాయం వద్ద చేరిన నీరు

బిచ్కుంద బస్టాండ్‌లో ఏటీఎం ధ్వంసం

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇండియా ఏటీఎంను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం ఏటీఎంలో డబ్బులు డ్రా చేయడానికి వెళ్లిన వ్యక్తులు లోపల ఉన్న ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసినట్లు గమనించి వెనుతిరిగి వెళ్ళిపోయారు. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇలా జరగడం మొదటిసారి అని గత రెండు మూడు రోజుల నుండి వర్షాలు కురుస్తుండడం రాత్రి సమయంలో జనసంచారం ఎక్కువగా లేకపోవడం వలన పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించకపోవడం అది గమనించిన వ్యక్తులు ఏటీఎం ధ్వంసం చేసి డబ్బులు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించి ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏటీఎం లోపల చుట్టూరా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తే ఏటీఎం మిషన్ ధ్వంసం చేసిన వ్యక్తులు దొరికే అవకాశాలున్నాయి.

ముంపు గ్రామాన్ని సందర్శించిన అధికారులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం మారుమూల గ్రామమైన హంగర్గ ఎస్సారెస్పీ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో గురువారం బోధన్ తహసీల్దార్ వరప్రసాద్, ఇంచార్జ్ ఏడీఏ సంతోష్ గ్రామానికి చేరుకుని వరద పరిస్థితిని పరిశీలించారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ గ్రామంలో ప్రవేశిస్తే గ్రామస్తులు అప్రమత్తంగా ఉండి అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే నీట మునిగిన పంటలను పరిశీలించారు. ప్రజలు శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండకుండా వారికి సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని అన్నారు. వారి వెంట గ్రామ పెద్దలు శ్యాంరావు పటేల్, గంగాధర్ తదితరులు ఉన్నారు .



జుక్కల్ : రుద్రపహాడ్ వద్ద నిలిచిన రాకపోకలు


రెంజల్ : కందకుర్తి వద్ద గోదారి ఉగ్రరూపం


లింగంపేట్ : పొంగిపొర్లుతున్న పెద్దవాగు

వీడని జడివాన..

• కొట్టుకుపోయిన రోడ్లు • పొంగిపొర్లిన వాగులు, చెరువులు • కూలిపోయిన ఇండ్లు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో గురువారం కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. చెరువులు అలుగులు పారాయి. వాగులు పొంగిపొర్లాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఇండ్లు కూలిపోయాయి. అయితే అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు.


లింగంపేట్ : పొల్కంపేట్ సమీపంలో పెద్దవాగు ప్రవాహంతో నిలిచిపోయిన రాకపోకలు


తాడ్వాయి: ఉధృతంగా ప్రవహిస్తున్న భీమేశ్వరం వాగు


బోధన్‌టౌన్: పట్టణంలోని ఓ కాలనీలో నిలిచిన నీరు


బిచ్కుంద : వర్షపు నీరు నిలువకుండా చర్యలు చేపడుతున్న అధికారులు


బిచ్కుంద : కూలిన ఇల్లు పరిశీలిస్తున్న ఆర్ఐ సాయిబాబా


భిక్కనూర్ : మండలంలో కూలిన ఇల్లు


బోధన్ : చిన్నమావంది వద్ద నీట మునిగిన పంట


ఎల్లారెడ్డి : కల్యాణి వాగును పరిశీలిస్తున్న ఆర్డీవో


కోటగిరి : సోంపూర్, హంగ్నా రహదారి మూసివేత


మద్నూర్ : లెండివాగుకు వరదతో గోజేగావ్‌కు నిలిచిన రాకపోకలు


మద్నూర్ : ఎస్‌టీఓ కార్యాలయంలో కూలిన పైకప్పు


మద్నూర్ : మండలంలో నీటమునిగిన పంటలు


నసురుల్లాబాద్ : బీర్కూర్‌లో కూలిన ఇల్లు


రామారెడ్డి : స్కూల్ తండాలో పునరావాస కేంద్రం ఏర్పాటు


రామారెడ్డి : కన్నాపూర్ వాగును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


రెంజల్ : నీలా శివారులో నీట మునిగిన పంటల పరిశీలన


తాడ్వాయి. కాలోజీవాడి రోడ్డుపై ఉధృతంగా పారుతున్న వాగు


వర్ని : చందూర్ మండల కేంద్రంలో పొంగిపొర్లుతున్న వాగు


పిట్లం : బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా నిలిచిపోయిన రాకపోకలను పరిశీలిస్తున్న అధికారులు

3న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జుక్కల్

మండల పరిషత్ కార్యాలయంలో ఆగస్ట్ 3న ఎంపీపీ సుర్నార్ యశోదా నీలుపటేల్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గురువారం పేర్కొన్నారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే హన్మంత్ షిండే ముఖ్య అతిథిగా రానున్నారని పేర్కొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రామేశ్వరపల్లి సర్పంచ్ పోతిరెడ్డి తెలిపారు. గురువారం గ్రామంలో అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, రమేష్ రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నసాగర్ ఎంపీటీసీ రిలే నిరాహారదీక్ష

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గ్రామ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని అన్నసాగర్ ఎంపీటీసీ ఉమాదేవి గురుప్రతాప్ గురువారం ఎల్లారెడ్డి తహశీల్దార్ కార్యాలయం ముందు తల్లీ తెలంగాణ ప్రాంగణంలో నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ సింగీతం ప్రాజెక్ట్ నుంచి పాత చెరువుకు కాలువ నిర్మాణం చేపట్టాలని, నార్వ పాత చెరువు నుంచి అన్నసాగర్ పంట పొలాలకు ప్రధాన కాలువ పూడిక తీయలాని అదేవిధంగా పోచారం డీ73 కాలువ చివరి ఆయకట్టు వరకు కాలువ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలి

• ఎస్ఎఫ్ఐ డిమాండ్



బోధన్‌టౌన్ : జీపుయాత్రలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్/కోటగిరి

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత గురువారం 6వ రోజు నవీపేట్ నుంచి బోధన్ పట్టణానికి చేరుకుంది. దీనికి ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఏశాల గంగాధర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ హాస్టల్లో కనీస వసతులు కల్పించకపోవడం విడ్డూరమని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్టల్లో ఔట్సోర్సింగ్‌గా పని చేస్తున్న వర్కర్లకు ఐదు నెలలు గడుస్తున్నా జీతాలు చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, జిల్లా నాయకులు జవహర్, బోధన్ డివిజన్ కన్వీనర్ సాయికుమార్, సంధ్యరెడ్డి, అరవింద్, శివ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : ఎస్ఎఫ్ఐ జీపుజాత బోధన్ నుంచి కోటగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై సవితి ప్రేమ చూపించడం బాధాకరమని అన్నారు.

సహాయక చర్యలు చేపట్టిన రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో బోధన్ పట్టణంలోని పలు వార్డుల్లో కొన్ని ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెవెన్యూ సిబ్బంది గురువారం సహాయక చర్యలు చేపడుతూ ప్రత్యామ్నాయంగా వేరే ఇండ్లను చూపిస్తామని అధికారుల తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పట్టణంలో తిరుగుతూ కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇండ్ల సమాచారాన్ని సేకరిస్తున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరుణ్, సిబ్బంది ఉన్నారు.

దన్నూర్‌లో కూలిన ఇల్లు..

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని దన్నూర్ గ్రామంలో సంగ్రామ్ అనే వ్యక్తి ఇల్లు భారీ వర్షానికి కూలిపోయింది. గత వారం పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పురాతనమైన ఇల్లు కూలిపోతున్నాయి. అయినా మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ వర్షాలకు జరుగుతున్న నష్టాల గురించి సమాచారం సేకరించడంలో విఫలమయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన జెడ్పీ కోఆప్షన్స్ సభ్యుడు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సిరాజుద్దీన్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• తహశీల్దార్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నసురుల్లాబాద్ తహసీల్దార్ భవయ్య ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం మండలంలోని నాచుపల్లి, నెమ్లీ, దుర్కి గ్రామంల్లో వర్ష తాకిడికి కూలిపోయిన నివాసపు ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ భవయ్య మాట్లాడుతూ.. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థలో ఉన్న పురాతన ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికి కూలిపోయిన ఇండ్లకు నష్టపరిహారం కోసం ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. పురాతనమైన ఇండ్లలో నివాసం ఉన్న ప్రతి ఇంటికి గ్రామ కార్యదర్శులు వెళ్లి పలకరిస్తున్నారని, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంతైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో అలాంటి కుటుంబాలను గుర్తించి పునరవాసం కల్పించాలని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం మరో రెండు రోజులు వర్షాలు ఉండటంతో గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. వీరి వెంట ఆర్ఐ హన్మండ్లు, ఎంపీఓ రాము, పలు గ్రామాల కార్యదర్శులు తదితరులున్నారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ

- పలుప్రాంతాల్లో పర్యటించిన మాజీ మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లోని వర్ష ప్రభావిత ప్రాంతాలకు ఆహార ప్యాకెట్ల పంపిణీకి నాయకత్వం వహిస్తు, ప్రభావిత ప్రాంతాల్లో నిజామాబాద్ మాజీ మేయర్ కాంగ్రెస్ నాయకులు డి.సంజయ్ గురువారం పర్యటించారు.అత్యంత ప్రభావిత ప్రాంతాలలో ఆహార ప్యాకెట్ల పంపిణీని చేయడమే కాకుండా ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వర్ష తాకిడికి గురైన ప్రాంతాలలోని రోడ్లను, ప్రజల నివాస పరిసర ప్రాంతాల్లో పరిస్థితులను తెలుసుకున్నారు.

విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గత రెండు మూడు రోజుల నుంచి వర్షాలు పడుతున్నా రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా నిజామాబాద్ రూరల్ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనిల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాగులు పారుతున్న దగ్గర దాట వద్దని, కరెంటు స్తంభాలు ముట్టుకోవద్దని, ఏదైనా అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని కోరారు. ఏ ఇబ్బందులు ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని, విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉంటూ సకాలంలో స్పందించాలని తెలిపారు. అన్ని శాఖల మండలాధికారులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

వర్ష బీభత్సం..

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్ జిల్లాలో బుధవారం రాత్రినుంచి గురువారం వరకు కురిసిన ఎడతెరిపిలేని వర్షానికి చెరువులు, వాగులు పొంగిపొర్లాయి. చెరువులు అలుగులు పారాయి. లోతట్టు ప్రాంతాలు, రోడ్లు చెరువులను తలపించాయి. పలుచోట్ల కాలనీలు జలమయమయ్యాయి. ఇండ్లలోకి నీరుచేరింది. వరదనీటికి రోడ్లు కోతకు గురయ్యాయి. వరదనీటితో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లపై ఉధృతంగా నీరు పారడంతో రోడ్లను మూసేశారు. జనజీవనం స్తంభించిపోయింది.


డిచ్‌పల్లి: రోడ్డును బంద్‌చేసిన అధికారులు


ఏర్గట్ల : పరిశీలిస్తున్న అధికారులు


అర్మూర్: రాజారాంకాలనీలో ఇండ్లలోకి చేరిన నీరు


నిజామాబాద్ రూరల్: జలమయమైన నిజామాబాద్ శివారు కాలనీ


భీంగల్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


జక్రాన్‌పల్లి : నీటితో నిండిన మోడల్ పాఠశాల గ్రౌండ్


జక్రాన్‌పల్లిలో..


కమ్మర్‌పల్లి : కస్తూర్బా విద్యార్థులను ఎంపీడీఓ కార్యాలయానికి తరలిస్తున్న అధికారులు


కమ్మర్‌పల్లి : జలమయమైన కాలనీ


మాక్లూర్ : రోడ్లను పరిశీలిస్తున్న జడ్పీచైర్మన్


నిజామాబాద్‌రూరల్ : నీటిమునిగిన పంటలు


మెపాల్‌లో..


మెండోరా మండలంలో..


ముప్కాల్‌లో..


నిజామాబాద్ రూరల్ : మూసేసిన ఖానాపూర్-కాలూర్‌రోడ్డు


వేల్పూర్‌లో..


సిరికొండ : పోలీస్‌స్టేషన్ సమీపంలో కాలనీలోకి చేరిన నీరు

తడుస్తూ.. పరిస్థితులు పరిశీలిస్తూ..

- పర్యవేక్షణ చేస్తున్న మంత్రి వేముల
- ప్రజలు, రైతులతో మాట్లాడుతూ ధైర్యం నింపుతున్న మంత్రి

నవతెలంగాణ-వేల్పూర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా,బాల్కొండ నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పరిస్థితులను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు అడ్డుకోలేం కానీ నష్టాన్ని నివారించగలం అంటూ జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ ప్రాణనష్టం జరగకుండా పరిస్థితులు చక్కదిద్దుతున్నారు. గతంలో ఎన్నడూ ఇంతటి వర్షాలు చూడలేదని స్థానిక ప్రజలు మంత్రితో అన్నారు.

రెవెన్యూ, పోలీస్, ఎలక్ట్రిసిటీ, పంచాయతీ రాజ్,ఇరిగేషన్,ఆర్ అండ్ బి,హెల్త్ పలు ప్రభుత్వ శాఖలు అధికారులను,క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలు,రైతులతో మాట్లాడుతూ మేమున్నాం అంటూ వారికి ధైర్యం చెప్తున్నారు. అత్యవసరం అయితే తప్పా ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులు,జాలర్లు ఎవరూ చేపల వేటకు వెళ్ళొద్దని కోరారు. మండల కేంద్రంలో ఆర్మూర్ నుండి జగిత్యాల్ కు వెళ్లే జాతీయ రహదారి వద్ద, పడగల్ గ్రామానికి వెళ్లే దారిలో చెరువులు తెగి వరదలు రోడ్ల పై నుండి పారుతుండటంతో వేకువ జామునే మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. ప్రజలను ఎవరిని బయటకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను, ఇరిగేషన్ అధికారులందరు ఫీల్డ్ లోనే ఉండి పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.


వర్షంలోనూ చెరువులను పరిశీలిస్తున్న మంత్రి

వర్షాలతో ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూంలకు సమాచారం అందించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూం లకు సమాచారం అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలను కోరారు. ఏకధాటిగా కురుస్తున్న వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ 08462 - 220183 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కంట్రోల్ రూమ్ నిరంతరం 24/7 పని చేస్తుందని, ఏ సమయంలోనైనా ప్రజలు ఫోన్ ద్వారా సమాచారం తెలుపవచ్చని అన్నారు. సమాచారం అందించిన వెంటనే వర్షాల తాకిడికి లోనైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని ఇప్పటికే అప్రమత్తం చేశామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెం. 08462 221001 అందుబాటులో ఉందని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ సర్కిళ్ల వారీగా కూడా దిగువ తెలిపిన నెంబర్లకు సమాచారం తెలుపవచ్చని సూచించారు. సర్కిల్ (1) : 9618210052, సర్కిల్ (2) : 7396633773, సర్కిల్ (3) : 9550023324, సర్కిల్ (4ఎ): 7815957095, సర్కిల్ (4బి): 8555062383, సర్కిల్ (5) : 9010155505 భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, కాలువలు, వాగులు, జలాశయాల వద్దకు వెళ్లకూడదని కలెక్టర్ హితవు పలికారు.

2.50 లక్షల ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన ఇర్ప ప్రియాంకకు గుండె ఆపరేషన్ కోసం బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ 2. 50 లక్షల ఎల్ఓసిని గురువారం అందించారు. గుండె ఆపరేషన్ విషయమై సర్పంచ్ విజయ రమేష్ ఫోన్ లో సమాచారం అందించారు. వెంటనే స్పందించి మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసి అందించి సహకరించినందుకు జెడ్పిటిసి సవిత బుచ్చన్న, ఎంపీటీసీ కృష్ణమోహన్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారత మిస్సైల్‌మెన్, భారతరత్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి ధర్మారం(బి) గ్రామంలోని జీనియస్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ జీనియస్ గంగారెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం మన దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. అబ్దుల్ కలాం ను అందరు ఆదర్శంగా తీసుకుని దేశ ఔన్నత్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఆయన కన్న కలలను సాకారాం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన జ్ఞాపకార్థం మొక్కలు నాటారు.

ఆశానగర్‌ను సందర్శించిన ఆర్డీవో

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని ఆశ నగర్ లో శిథిలావస్థలో ఉన్న గృహాలను నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్ పరిశీలించారు. గృహాలు చాలా ప్రమాదకరంగా ఉన్నాయని పునరావాసం కల్పిస్తామని కాలనీవాసులకు తెలిపారు. కేవలం రెండు మూడు రోజుల కోసం కాకుండా తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపాలని పట్టుబట్టారు ఎమ్మార్వో, ఎంపీడీవో ఎస్సై సముదాయించే ప్రయత్నం చేసిన ఒప్పుకోకపోవడంతో వెనుదిరిగారు. అంతకుముందు పోతంగల్ కల్యాణ మండపంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


- కూలీ పోయే ఇండ్లలో ఉండొద్దు
- చెరువులు, వాగుల వద్దకు వెళ్లొద్దు
- విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త వహించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నిజామాబాద్ పట్టణ పరిధిలోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి గురువారం పేర్కొన్నారు. కూలీ పోయే ప్రమాదంలో ఉన్న ఇండ్లలో నివసించే ప్రజలు సురక్షిత నివాసాలకు తరలివెళ్లాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉండే ఇండ్లలోకి వర్షపునీరు చేరకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్థంబాల వద్ద, ఇంట్లో ఎలక్ట్రిక్ వస్తువుల నుంచి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ట్రాన్స్ ఫార్మర్లతో, కరెంటు మోటార్లతో జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్లను గమనించి వాహనాలను సురక్షితంగా నడిపి గమ్యాన్ని చేరుకోవాలని కోరారు. అత్యవసరమైన పరిస్థితుల్లో డయల్ 100, కానీ 2వ పట్టణ ఎస్సై అశోక్ 8712659838, 3 వ పట్టణ ఎస్సై ప్రవీణ్ 8712658839, 4 వ పట్టణ ఎస్సై సంజీవ- 8712659840 పట్టణ సీఐ నరహరి 8712659836 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సహకారాలు అందిస్తామన్నారు.

ఊరుస్తున్న ఇందల్‌వాయి బస్టాండ్

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



ఇందల్‌వాయి బాస్టాండ్‌లోకి చేరిన వర్షపు నీరు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్వాయి మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఊరుస్తోంది. నూతన బస్టాండ్ నిర్మించేలా చూడాలని పలువురు కోరుతున్నారు. బస్టాండ్‌లో వరికి వచ్చే చోట గొయ్యి ఏర్పడడంతో దానిలో వర్షపు నీరు చేరి బస్సులకు సైతం ఇబ్బందికరంగా మారిందని ఎక్కడ డ్రైనేజీ లేక నీరు ఎటు వెళ్లలేని పరిస్థితి ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఈ బస్టాండ్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నూతన బస్టాండ్ నిర్మించేందకు నిధులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

- జిల్లాలో పరిస్థితిపై కలెక్టర్‌తో మంత్రి సమీక్ష

నవతెలంగాణ-వేల్పూర్

ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న తాజా పరిస్థితులపై రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం ఫోన్ ద్వారా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో సమీక్షించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో నెలకొన్న స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి అదుపులోనే ఉందని, ఎక్కడ కూడా ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లడం వంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంత్రి దృష్టికి తెచ్చారు.

అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున వరద ప్రవాహం వస్తున్నందున పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ప్రశాంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రం సమీపంలో నిజాంసాగర్ కెనాల్‌పై నివాసాలు ఏర్పరచుకున్న సుమారు 400 కుటుంబాలను తక్షణమే సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు. పూలాంగ్ వాగు ఇరుపక్కల నివసిస్తున్న వారిని కూడా ఇతర ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. నిజామాబాద్ నుండి ఆర్మూర్ వెళ్లే మార్గంలో మాణిక్ బండార్, ముబారక్ నగర్, గూపన్ పల్లి తదితర ప్రాంతాలవద్ద ప్రధాన రహదారిపై వర్షపు జలాలు నిలిచి ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. బోధన్ పట్టణంలోనూ నాలాను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షించి అవసరమైన చోట తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. రామడుగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిని సంతరించుకుంటున్నందున దిగువ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ఏరియాలో శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ప్రవహించే ప్రదేశాల్లో ఎవరు కూడా చేపలు పట్టేందుకు వెళ్లకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుండి ఎస్సారెస్పీలోకి భారీగా ఇన్ ఫ్లో వస్తున్నందున తల్వేద, మారంపల్లి, నూత్ పల్లి, బాద్గుణ తదితర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. కంట్రోల్ రూమ్‌లలో ఎల్లవేళలా సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా అధికారులు, సిబ్బందిని సమాయత్త పర్చాలని మంత్రి సూచించారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-పిట్లం

వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ లింబాద్రి, ట్రాన్స్ కో ఏడీ రామకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని తిమ్మానగర్ - పిట్లం మధ్యగల లో లెవెల్ పురాతన కాకి వాగు, పత్తేపురం-తిమ్మానగర్ మధ్యన గల నల్లవాగుపై కొనసాగుతున్న నూతన బ్రిడ్జి పనుల కారణంగా అంతర్ జిల్లాల నిలిచిపోయిన రాకపోకలను అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్పపీడనం వల్ల వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంత ప్రజలు చెరువులు, వాగులు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్తు వైర్లు, స్తంభాలను తాకవద్దని సూచించారు. పురాతన నివాస గృహాలలో ఉండరాదన్నారు. వాహనాలపై ప్రయాణం చేయు సమయంలో రోడ్లపై భారీ నీటి ప్రవాహం ఉన్నందున వాటిపై ప్రయాణం చేయరాదన్నారు. తప్పని పరిస్థితులలో ప్రయాణం చేయవలసి ఉన్నట్లయితే నీటి ప్రవహమును పరిశీలించి జాగ్రత్తలు పాటించాలన్నారు. గుంతల మయమైన రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం చేయాలని వారు సూచించారు.

పదోన్నతి పొందిన లయన్ ప్రతినిధికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

ఇంటర్నెట్ లయన్స్ క్లబ్ తెలుగు రాష్ట్రాలకి చెందిన లయన్ ప్రతినిధి పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గట్టంనేని బాబురావు అంతర్జాతీయ లయన్స్ క్లబ్ లో డైరక్టర్‌గా పదోన్నతి పొందగా బుధవారం రాత్రి పట్టణానికి చెందిన లయన్స్ కబ్స్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షులు గుజరాతీ ప్రకాష్ , లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతీ మెమోంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటువంటి డైరక్టర్ పదవీ తెలంగాణకు చెందిన వ్యక్తి కి రావడం చాలా గొప్ప విషయంఅని మాజీ అధ్యక్షులు డి కే రాజేష్ కొనియాడారు. కార్యక్రమంలో సెక్రటరీ ఆల్జాపుర్ రాజేష్, కోశాధికారి కుంటలా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏలకు 61 ఏళ్ల నిబంధనను తొలగించాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

వీఆర్ఏలకు 61 ఏళ్ల నిబంధనలను తొలగించి వీఆర్ఏ వారసులకు న్యాయం చేయాలని వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు రొడ్డ సాయన్న గురువారం అన్నారు. 61 ఏళ్ల నిబంధనలు కుదించి 55 ఏళ్లకు నిబంధనలు సరిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వీఆర్ఏ వారసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇన్నాళ్లు తామంతా విధులు నిర్వర్తించినప్పటికీ తమకు సరైన న్యాయం జరగడం లేదన్నారు. వీఆర్ఏలకు 61 ఏళ్ల నిబంధనలను పరిగణలకు తీసుకోవడం వల్ల13 మంది వీఆర్ఏ వారసులకు అన్యాయం జరుగుతుందని సాయన్న తెలిపారు

పాలకంకులు కవితా సంపుటికి ముద్రణకు స్వీకరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన మాదస్త ప్రణవి రచించిన తొలి కవితా సంపుటి "పాలకంకులు "అనే కవితా సంపుటికి డాక్టర్ సి.నారాయణరెడ్డి 92వ జయంతిని పురస్కరించుకొని సుశీల నారాయణరెడ్డి స్మారక ట్రస్ట్ వారు ముద్రించడానికి స్వీకరించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు కె.వి.రమణాచారి, ఎల్ శివారెడ్డి, సుద్దాల అశోక తేజ పాల్గొన్నారు. మహిళ రచయితలు, కవయిత్రులు ఈ సాహిత్య సేవకు మరింత ప్రోత్సాహం అందిస్తుందని ఇలాంటి కవయిత్రి నిజామబాద్ జిల్లా ముద్దుబిడ్డ కావడం నిజామాబాద్ జిల్లాకే గర్వకారణమని ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణ అధికారిగా పనిచేస్తున్న కవి, రచయిత, జిల్లా తెలంగాణ సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఎనుగందుల శంకర్ మాదస్త ప్రణవికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

పంట నష్టం.. రైతుల ఆందోళన

- లెండి వాగు, మంజీరా నది పరివాహక పాంతవాసుల ఇబ్బందులు
- ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా ఉన్నతాధికారులు సందర్శించాలని విజ్ఞప్తి

నవతెలంగాణ-మద్నూర్/బోధన్/ఎడపల్లి

మద్నూర్ మండలం తెలంగాణ రాష్ట్రానికి, జిల్లా కేంద్రానికి పూర్తిగా మారుమూల ప్రాంతంలో ఉంటుంది. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న ఈ మండలంలో గత వారం పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయి. మండలంలోని ఎగువన మహారాష్ట్ర ప్రాంతం నుంచి ప్రవహించే లేండి వాగుకు వరద ఉధృతి పెరగడంతో లెండి వాగు పరివాహక గ్రామాలైన గోజేగావ్, సోనాల, తడిహిప్పర్గ, లింబూర్, చిన్నటాక్లి, పెద్దటాక్లి గ్రామాల శివారు ప్రాంతం వరద తాకిడితో వందల ఎకరాల పంట నష్టం వాటిల్లింది. ఇటు మంజీరా నది పరివాహక గ్రామమైన సిర్పూర్ గ్రామ రైతులు సైతం పంట నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పాటు లెండి వాగుకు భారీగా వరద వచ్చి గోజేగావ్ గ్రామ ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఇటు లింబూర్-చిన్నటాక్లి గ్రామాల మధ్యగల వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

పట్టని ప్రజాప్రతినిధులు..

వర్షంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా ఉన్నతాధికారులు, ఏ ఒక్కరు కూడా పరిశీలించడానికి రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే భారీ వర్షాలకు ఇబ్బందులు పడవలసిందే. గత వారం పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతానికి పంట నష్టం భారీగా జరిగింది. రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాలను పరిశీలించాలని కోరుతున్నారు.

భారీ వర్షాల కారణంగా నదుల వైపు వెళ్ళకూడదు..

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా మద్నూర్ మండలంలోని లేండి వాగు నది వైపు డోంగ్లి మండలంలోని మంజీరా నది వైపు రైతులు వెళ్లకూడదని మద్నూర్, డోంగ్లి మండలాల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలకు ఎరువులు, కలుపు మందు, పురుగుల మందులు పిచికారీ చేయవద్దని సూచించారు.

బోధన్ నియోజకవర్గంలో 460 ఎకరాలలో పంట నష్టం..

బోధన్ : గురువారం కురిసిన భారీ వర్షానికి బోధన్ నియోజకవర్గంలో 210 ఎకరాలలో వరి పంట, 250 ఎకరాలలో సోయా పంట నష్టం జరిగినట్లు బోధన్ మండల ఇన్చార్జి ఏడీఏ సంతోష్ తెలిపారు.

చిన్నమావంది, పెద్దమావంది శివారులో పంటలు పూర్తిగా నీటమునిగాయి. ఖాజాపూర్ శివారులో జలుబా అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల సోయపంట కొట్టుకుపోయింది. సాలురా ప్రధాన రహదారి పక్కన ఆరుతడి పంటలు మునిగిపోయాయి. నష్టపోయిన పంటలను బోధన్ తహసీల్దార్ వరప్రసాద్, ఏడీఏ సంతోష్ హంగర్గా శివారులో పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా నిజాంసాగర్ నీటి విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించడంతో మంజీరా సమీప ప్రాంతమైన బిక్నెల్లి, ఖాజాపూర్, హున్స, మంధర్న గ్రామాలలో గ్రామ ప్రజాప్రతినిధులు మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేశారు.

నీట మునిగిన వరి పంట..

ఎడపల్లి :మండలంలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వర్షం నీరు చెరువులకు చేరుకోవడంతో చెరువుల ఆయకట్టు కింద, చెరువుల పక్కనే ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. ఎడపల్లి మండలంలోని మంగళ్‌పహాడ్ చెరువు పూర్తిస్థాయిలో నిండిపోయింది. అంబం (వై) గ్రామానికి వెళ్లే రహదారి కొద్ది దూర సమీపంలో ఉన్న చెక్ డ్యాంపై వర్షపు నీరు పొంగిపొర్లుతోంది.

61 ఏళ్ల నిబంధనను తొలగించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

61 ఏళ్ల నిబంధనను తొలగించి వీఆర్ఎ వారసులకు న్యాయం చేయాలని వీఆర్ఎల సంఘం డిచ్ పల్లి మండల అధ్యక్షులుగంగాధర్, ప్రధాన కార్యదర్శి సూర్యరాజ్ అన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వీఆర్ఏల వారసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇన్నాళ్లుగా తామంతా విధులు నిర్వర్తించినప్పటికీ తమకు సరైన న్యాయం జరగడం లేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం న్యాయం చేయాలని వారు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు విన్నవించుకున్నారు.

మహంతంలో భారీ వర్షానికి కూలిన నాలుగు ఇండ్లు

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని మహంతం గ్రామంలో వర్షానికి నాలుగు ఇండ్లు కూలిపోయాయి. గ్రామంలోని సుంకరి గంగాధర్ నడుకుడ సుమలత, సాట్ల సాయిలు, గుండ్ల లక్ష్మీబాయి పాతఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

వర్షంలో సైతం సహాయక చర్యల్లో వీడీసీ బృందం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో చెరువుకు ఒక సైడు గండి కొట్టారు. దీంతో సమీపంలోని ఎస్సీ కాలనీకి సైతం ప్రమాదం తప్పింది. వీడీసీ బృందం ప్రవీణ్ గౌడ్, వెల్మల మైపాల్, లక్కారం నరేష్ ,ఆకుల లక్ష్మణ్, ప్రసాద్ ,చిన్నారెడ్డి తదితరులు సహాయక చర్యలు చేపట్టడం పట్ల పలువురు అభినందించారు.

నిరుపేదలకు అన్నదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

భారీ వర్షాలు కురుస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదల ప్రజల ఆకలిని తీర్చేందుకు కమ్మర్ పల్లి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ వర్షాల మూలంగా ఇండల్లోకి నీరు చేరి వంట చేసుకోలేని, భిక్షాటనతో జీవనం సాగించే నిరుపేదల కోసం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రఘు హెూటల్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది నిరుపేదలు ఆనందంగా భోజనం చేశారు. వర్షాల మూలంగా తాము పడుతున్న ఇబ్బందులు గ్రహించి తమకు భోజనం అందించిన స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు పలువురు నిరుపేదలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు చిటికేసి రఘు, కొత్తపల్లి గణేష్, జోగ గంగాధర్, వడ్ల మోహన్, గణపురం రవి, నరేందర్, యమ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఏసీపీ బదిలీ

నవతెలంగాణ-బోధన్

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రభుత్వం పోలీసు శాఖలో బదిలీలు చేపట్టింది. అందులో భాగంగా పోలీస్ శాఖలో ఇప్పటికే ఎస్సైల బదిలీలు చేపట్టింది. ప్రస్తుతం ఏసీపీలను బదిలీ చేపట్టడంతో బోధన్ ఏసీపీగా పనిచేస్తున్న కే.ఎం కిరణ్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను హైదరాబాదులోని డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉన్నత అధికారులు ఆదేశించారు.